


రైతు ఋణ విముక్తి

రాళ్లబండి రాఘవశర్మ

తెలంగాణ సాహిత్య అకాడమి

C1

రైతు ఋణ విముక్తి

రాళ్లబండి రాఘవశర్మ

రైతు ఋణ విముక్తి

రాళ్లబండి రాఘవశర్మ

తెలంగాణ సాహిత్య అకాడమి

రైతు ఋణ విముక్తి

రాళ్లబండి రాఘవశర్మ

ప్రతులు : **2000**

ప్రచురణ సంఖ్య - 16

ప్రథమ ముద్రణ : 1951

ద్వితీయ ముద్రణ : 2018

వెల : 25/-

ప్రచురణ :

తెలంగాణ సాహిత్య అకాడమి

కళాభవన్, రవీంద్ర భారతి ప్రాంగణం

హైదరాబాదు - 500 004.

ప్రతులకు :

అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్

అజమాబాద్, హైద్రాబాద్.

ఫోన్ : 040-27678411

4

మద్గురువర్యులును

శ్రీ పాండురంగాశ్రమ నివాసులును

పూజ్యపాదులునగు

శ్రీశ్రీ భావానందస్వాములవారికి

సభక్తికముగా సమర్పితము

రైతు దైన్యం

తెలంగాణలో ప్రజాబాహుళ్యానిది ప్రధానంగా వ్యవసాయ జీవనమే. కింద భూమి, పైన ఆకాశాన్ని నమ్ముకొని రెక్కల కష్టం పణంగా పెట్టి వ్యవసాయం కొనసాగించేవారు. వర్షాధార సేద్యం తప్ప మరో మార్గం లేకపోవటం వల్ల స్థానిక రైతు అనేక బాధలనుభవించవలసి వచ్చింది. మౌఖిక సాహిత్యం వెల్లివిరిసినా, లిఖిత సాహిత్యం పరిమళించినా రైతు జీవితం అనివార్యంగా ప్రతిబింబిస్తూ వచ్చింది. ఆధునిక కాలంలో 'రైతు' కేంద్రంగా చాలా కవిత్వం సముద్భవించింది. వర్షాభావం రైతు కంట కన్నీరొలికించినప్పుడల్లా కవులు పూనుకొని అక్షరాలు పలికించి, లిఖించి రైతునూరడించి ధైర్యం నూరిపోసిన సన్నివేశాలు తెలంగాణలో ఎక్కువ. గంగుల శాయిరెడ్డి 'కాపుబిడ్డ', గవ్వా మురహరి రెడ్డి 'గుంటుక పురాణం', వానమామలై జగన్నాథాచార్యులు 'రైతు రామాయణం' వంటివి ప్రాచుర్యం పొందాయి.

రాళ్ళబండి రాఘవశర్మ స్వీయ వ్యవసాయ జీవనానుభవం నుంచి రచించిన లఘు కావ్యం 'రైతు ఋణవిముక్తి'. స్వాతంత్ర్యానికి పూర్వమే తెలంగాణ రైతు పరిస్థితిని హృదయానికి హత్తుకునేటట్లుగా చిత్రించినా అంతగా ప్రాచుర్యం లభించలేదు. 'క్షీరసాగరమ'నే గ్రామంలో నివసిస్తూ సాహిత్య, సామాజిక చైతన్య వ్యాప్తికి కృషి చేసిన కవి రాఘవశర్మ.

'రైతు ఋణ విముక్తి' ఒకరకంగా ఆత్మకథే. తెలంగాణలో బ్రాహ్మణులు, వైశ్యులు కూడా వ్యవసాయం సాగించిన దాఖలాలు చాలా కనిపిస్తాయి. రాఘవశర్మ వర్ణించినట్లు 'ఠెక్కాడ బుక్కాడు నన్నరీతి'లో రైతు జీవితం సాగేది. 'చేత నాగలిపట్టి సేద్య మొనర్చుచు భూదేవి దయకు కేల్మోడ్చు'తూ 'కాలు సేతులు చలించియు గట్టున జేర నేరని' కృషీవలత్వం రైతుది. ఆత్మకథ అని ఎందుకు భావించానంటే కావ్యంలోని రైతు అక్కడక్కడ 'గట్టున కూర్చుండి సరస పద్యముల చదువు'తూ, 'ఉయ్యాల మంచము నూగుచున్ పాఠము నేర్పు'తూ సేద్యం కొనసాగిస్తాడు. కాగా – వానలు పడని

కాలం ఎదురై వ్యవసాయం కుంటుపడిన వేళ 'కుడువ నన్నము కట్టు గుడ్డ బహుయత్నం'తో తప్ప దొరకని స్థితి ఏర్పడుతుంది. జీతగాళ్లు పని చాలించుకొని వెళ్లి పోతారు. "అప్పుకు తిప్పుచు దెప్పుచు" "ఆత్మ గౌరవాభిమానమ్ముల వీడుకొనని బీద రైతు" "చేతికందిన కూతురు చనిపోవటం" హృదయ విదారకంగా కవి వర్ణిస్తాడు. కావ్యంలోని సాహుకారి సహకారి గనుక రైతు స్థితి నర్థం చేసుకొని ఆదరించటం విశేషం.

రాఘవశర్మ పద్యం రైతు ననుసరించింది గనుక హృద్యంగా సాగింది. ఈ కావ్యం 1951లోనే ప్రచురించబడింది. అరున్నర దశాబ్దాలుగా తిరిగి ముద్రణకు నోచుకోలేదు. వారి పౌత్రుడు రాళ్ళబండి దివాకర్ తెలంగాణ సాహిత్య అకాడమీ దృష్టికి తీసుకరాగానే ప్రచురించటానికి నిర్ణయమైంది. ప్రాచుర్యానికి తేవటమే ముందున్న పని. కావ్య ప్రతి నందించి ప్రచురించే అవకాశం కల్పించినందుకు, పరిచయం కూర్చినందుకు రాళ్ళబండి దివాకర్‌కు ధన్యవాదాలు.

హైదరాబాద్
06.07.2018

నందిని సిధారెడ్డి
ఛైర్మన్
తెలంగాణ సాహిత్య అకాడమీ

శ్రీయై నమః

తొలి పలుకు

"ఊహ కలంగి జీవనపుటోలమునం బడి పోరుచున్, మహా మోహ లతా నిబద్ధ పదమున్ విడిపించుకొనంగ లేక సందేహముం బొందు దేహిక్రియ...." అని పోతన కవీంద్రుని సూక్తి. ఇది గజేంద్రుని పరముగా వర్ణితమయ్యు యథార్థమునకు దేహిమాత్రులకెల్లరికిని ననువర్తించునదియే గదా!

'రైతు ఋణ విముక్తి' అను ఈ చిన్ని పొత్తమునఁ గల యితివృత్తమున సైతము రైతు యొక్క సాంసారిక నిత్యజీవితమును, కర్మఫలానుభూతములగు సుఖదుఃఖ సముపలబ్ధములును తద్విమోచన యత్నములును, చిత్రితములై యున్నయవి. ఋణగ్రస్తుడును ఋణదాతయు జీవేశ్వరులబోలి ధ్యాతృధ్యేయులగుచున్నారు.

కవి స్వీయానుభవమును ప్రపంచానుభూతితో మేళవించి, కథాపాత్రల ముఖమున కావ్యరూపమున వెల్లడించుట సహజము.

అటులనె మామిత్రులు, ఉభయ భాషా కావ్యరచనాభి శోభితులు శ్రీ రాఘవశర్మగారు దీనిని వ్యంగ్య స్ఫురణకుఁ దెచ్చి పాఠక లోకమునకు సమర్పణము గావించుకొనిరి. ఎంతయు ధన్యులని తలంతును.

ఖరసంవత్సర ఆషాఢశుద్ధ ౨ — వెల్లంకి. వేంకటరమణయ్య

సికింద్రాబాద్. — వెస్లీ హైస్కూలు

బ్రా॥శ్రీ రాఘవశర్మగారి ఖండకావ్య మామూలాగ్రముగా చూచినాను. కవిత లలితమైన భాషతో సలక్షణ శైలిలో నడిచినది. బీదలపట్ల ధనికులు చూపించఁదగిన యుదారభావ మిందు చక్కఁగఁ జిత్రించఁబడినది. శ్రీ శర్మగారికి మా యభినందనములు.

శిరోమణి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

ధన్యవాదము

ఒక విషమ సమయమున నుబుసుపోకకై వ్రాసిన పద్యములు, శ్రీశ్రీ భావానందస్వామివారుపదేశవాక్యముల నుదాహరణముగా చెప్పిన భావముం బురస్కరించుకొని ఈ "రైతు ఋణ విముక్తి" యను కథగాఁ బరిణమించినవి. వీనిని ముద్రించుట కుత్సాహపరచి సాయపడిన శతావధాని బ్రా॥శ్రీ గజవల్లి చంద్రమౌళి శాస్త్రులుగారికిని, సరిచూచి స్వాభిప్రాయ మొసఁగిన బ్రా॥శ్రీ శిరోమణి కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారికిని, తొలిపలుకును వ్రాసిన వెస్లీ హైస్కూల్ తెలుగు పండితులగు బ్రా॥శ్రీ వెల్లంకి వేంకటరమణయ్యగారికిని నా హృదయ పూర్వక ధన్యవాదములు.

జగత్కల్యాణకర్తయగు సర్వేశ్వరుఁడు, ముద్రణార్థమై సహాయపడిన రసికుల నెల్లర ననుగ్రహించుగాక.

క్షీరసాగరం
ఖర సం॥ ఆషాఢ శు॥ ౨

ఇట్లు
రా. రాఘవశర్మ

పరిచయం

'రైతు ఋణవిముక్తి' అనే పద్యకావ్యం (స్వాతంత్ర్యానికి పూర్వం - ఆనాటి తెలంగాణలో ఒక సాధారణ రైతు - హృదయావిష్కరణ చేసిన కావ్యం) రచయిత కీ.శే. రాళ్లబండి రాఘవశర్మగారు (1909-1978).

వీరు సంస్కృతాంధ్ర పండితులు, అవధాని, బహుగ్రంథకర్త. స్వాతంత్ర్యానికి పూర్వం తెలంగాణలో ఉర్దూ భాషకు దీటుగా తెలుగు సాహిత్యానికి చేయూతనిస్తూ, ప్రజలలో తెలుగు సాహిత్యంపట్ల అభిరుచిని పెంపొందించడానికి ఎందరో సాహితీవేత్తలు కృషి చేసారు. వారిలో మనకు అంతగా పరిచయంలేని సంస్కృతాంధ్ర పండితులు, కావ్యకర్త, అవధాని, కీ.శే. రాళ్లబండి రాఘవశర్మగారు అగ్రగణ్యులు. వీరు ప్రస్తుత సిద్ధిపేట జిల్లా, గజ్వెల్లి తాలూకా, క్షీరసాగరం గ్రామంలో రత్నయ్య, సీతమ్మ దంపతులకు జన్మించారు.

కీ.శే. రాఘవశర్మగారు బాల్యం నుంచీ తండ్రి, గురువుల ప్రోత్సాహంతో పంచకావ్యాలు, సాహిత్య, జ్యోతిష, వ్యాకరణ రంగాలలో విశేష కృషి చేసి ఆ ప్రాంతంలో గొప్ప పండితునిగా పేరు గడించారు.

వీరు తమ పదమూడో ఏటనే అవధాన ప్రక్రియను ఆరంభించి, ఎందరో మహామహులతో లెక్కలేనన్ని అవధానాలు పూర్తి చేసారు.

కీ.శే. రాళ్లబండి రాఘవశర్మగారు కావ్యరచనలో, నిరాడంబరతలో పోతనామాత్యులను పోలినవారు. వీరు రచించిన ఎన్నో కావ్యాలు, పద్యరచనలు ఎన్నో సామాజిక అంశాలలో ప్రజలను చైతన్యపరిచేవి. తమ రచనల ద్వారా భక్తి, సేవా, సాహిత్య రంగాలలో ప్రజలకు మార్గదర్శనం చేసేవారు. వీరు బహుగ్రంథకర్త. సుమారు 80 సంవత్సరాల క్రితం, రవాణా సౌకర్యాలు అంతగా లేని కాలంలోనే ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి, కీ.శే. శర్మగారు శ్రీపాండురంగా ప్రింటింగ్ ప్రెస్ అనే ముద్రణాలయాన్ని క్షీరసాగరం గ్రామంలో నిర్వహించేవారు.

ఆ కాలంలో ప్రముఖమైన గోల్కొండ కవుల సంచికలో "మార్గదర్శి" శీర్షికన వీరి రచనలు ఎన్నో ప్రచురితం అయినాయి.

వీరు మార్కూరు పాండురంగాశ్రమ వ్యవస్థాపకులైన శ్రీభావానందస్వామి వారి ముఖ్య శిష్యులై, తెలంగాణ ప్రాంతంలో అనేక భాగవత సప్తాహాలు, దేవాలయ ప్రతిష్ఠలు, బ్రహ్మోత్సవాలు, శ్రీసీతారామకళ్యాణాలు నిర్వహించేవారు. అందులో భాగంగా ఈ ప్రాంతంలో ప్రముఖ దేవాలయాలైన ఆలియాబాద్ రామాలయం, కీసరగుట్ట, యాదగిరిగుట్ట దేవాలయాల్లో బ్రహ్మోత్సవాలకు ఆచార్యులుగా వ్యవహరించేవారు.

వీరు తమ సమకాలికులైన కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు, కీ.శే. పెరవలి లింగయ్య శాస్త్రిగారు, కీ.శే. వెల్లంకి రమణయ్యగారు, కీ.శే. విరాల చంద్రమౌళిశాస్త్రి గారు, కీ.శే. బ్రహ్మభట్ల విధుమౌళి శాస్త్రిగారు, శ్లేషయమక చక్రవర్తి ఎన్నో భక్తి, సాహితీ సమావేశాలను నిర్వహించేవారు. వీరి రచనలలో ముఖ్యమైనవి:

1. రైతు ఋణవిముక్తి
2. భావానందము
3. కీసర శ్రీరామలింగేశ్వర సుప్రభాతము
4. శ్రీరామచంద్ర సుప్రభాతము
5. శివ మానసిక పూజ
6. భావానంద గురుస్తుతి
7. సత్యనారాయణ స్తవము
8. దత్త స్తవము
9. సూర్యస్తుతి
10. శివస్తవము (సంగీత రూపకం)
11. ప్రబోధ గేయాలు
12. చుంచనకోట శ్రీ భువనేశ్వరి మాతా శ్రీమాతృ స్తవము
13. పాండురంగాష్టకము
14. భావానందాష్టకము

వీరు తమ సాహితీప్రజ్ఞచే వారి మిత్రులు, సమకాలీకులకు రాసే లేఖలలో పద్య రూపకంగా ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచేవి.

వీరు రచించిన పద్యకావ్యాలలో ముద్రితమైనవి 'రైతు ఋణవిముక్తి' మరియు 'భావానందము'.

కీ.శే. రాఘవశర్మగారు రచించిన "శివస్తవము" అనే సంగీత నృత్య కావ్యము, శ్రీ రాధా రాజారెడ్డి గారిచే అఖిల భారత సంగీత నృత్యోత్సవంలో కూచిపూడి నాట్యరూపకంగా ప్రదర్శింపబడింది.

హైదరాబాద్ విముక్తి తరువాత, 1950వ సంవత్సరంలో అప్పటి ఇండియన్ ఆర్మీ జనరల్ జె.ఎన్.చౌదరిగారు హైదరాబాద్ వచ్చిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కీ.శే.రాఘవశర్మగారు వారికి స్వాగతం పలుకుతూ, స్వాగత పద్యాలు రాసినారు.

కీ.శే. రాఘవశర్మగారు బహుముఖ ప్రజ్ఞాశాలి అయినప్పటికీ, నిరాడంబరంగా తన స్వగ్రామంలో సామాన్యరైతువలె జీవనాన్ని సాగించేవారు. సామాన్య రైతుల జీవన విధానము, వారి ఋణ బాధలు, వారి ఆత్మాభిమానం తెలిసినవారు కాబట్టి వారి రచన అయిన "రైతు – ఋణ విముక్తి" అనే పద్య కావ్యంలో ఈ అంశాలన్నీ ప్రతిబింబిస్తాయి.

"రైతు – ఋణ విముక్తి" పద్యకావ్యం 1951వ సంవత్సరంలో ప్రచురితమైనప్పటికీ ఈ కావ్యంలోని అంశాలు కాలంతో నిమిత్తం లేకుండా సర్వకాల సర్వావస్థల యందు స్మరించుకోవాల్సిన అంశాలు.

ప్రకృతి వలన రైతు పడే కష్టాలు, పంటలు పండక తీర్చుకోలేని ఋణ బాధలు, రైతులకు ఋణాలిచ్చే సాహుకారు లేదా ప్రస్తుత పాలకులు, బ్యాంకులు ఎంత హుందాగా రైతు ఆత్మగౌరవాన్ని కాపాడాలో ఈ కావ్యం ద్వారా కీ.శే. రాఘవశర్మగారు రచించిన "రైతు – ఋణ విముక్తి" పద్య కావ్యానికి శ్రీ వెల్లంకి రమణయ్యగారు తొలిపలుకు వ్రాసారు. శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు పీఠిక వ్రాసినారు. ఈ పద్యకావ్యంలోని మొదటి సీసపద్యంలోనే రైతు యొక్క ఔన్నత్యాన్ని కవి హృద్యంగా గంభీరంగా అభివర్ణించారు.

సీ. అతఁడు విద్యాధికుండా? కాదు కాకున్న
సర్వధర్మజ్ఞధీశాలి యయ్యె,
నైశ్వర్య సంపన్నుఁడా? కాదు కాకున్నఁ
బాఁడిపంటలుగల్గి ప్రభుత నెఱపె,
వ్యవహార విదుఁడందుమా? కాదు కాకున్నఁ
దీర్ఘరియను పేరుఁ దెచ్చుకొనియె,
నఖిలావనోద్యోగియా? కాదు కాకున్న
నెల్లరగౌరవం బెనసి మించె.

కాలం కలిసిరాక, వర్షాభావంతో, కరువుతో, పంటలు లేక క్రుంగిపోయే రైతు పరిస్థితిని ఈ తేటగీతిలో మనసుకు హత్తుకునేలా వ్రాసారు.

తే.గీ. గడచినట్టికాలమె సుఖకాలమయ్యె,
దారుణంబగు కాలంబు దాపురించి,
బలముడిగి, చిక్కి, కడగండ్లఁబడి, దరిద్ర
దశ ననుభవించెనారైతు దైవవిధిని

సన్నకారు రైతుకు రుణాలిచ్చే బ్యాంకు వ్యవస్థలుగానీ, సాహుకార్లుగానీ, ఫైనాన్సులు గానీ ఎట్లా ఉండాలో ఒక ఆదర్శవంతమైన వ్యాపారి, సాహుకారి పాత్రలో వివరించారు.

తే.గీ. సర్వశుభకార్యములనుఁ బ్రశస్త రీతి
నెట్టియిక్కట్టులుంగల్గనీక సలిపి,
కలిసియుండు నెల్లపుడు నిష్కపటబుద్ధి,
సకల జనలోక సహకారి, సాహుకారి.

క. శ్రీమంతుడు, గుణవంతుఁడు,
ధీమంతుడు, బుద్ధిమద్విధేయుఁడు వినుత
ప్రేమస్వరూపుఁ డెల్లర
నోమఁగలుగు సాహుకారి యుపకారి కదా!

ఈ పద్యకావ్యంలో రైతుల ఆత్మగౌరవాన్ని, ఆర్థికంగా ఇబ్బందులున్నా తట్టుకునే ధైర్యాన్ని కీ.శే. రాఘవశర్మగారు కళ్ళకు కట్టినట్టుగా వ్రాసారు.

తే.గీ. తనపొలమ్మునఁ బండిన ధాన్య మొకఁడె
జీవనాధారమై యన్యసేవలేక
యలరి, తెక్కాడ బుక్కాడు నన్న రీతి
పేదతనమున నొప్పు నా బీదరైతు.

సీ. తనయింట లేకుంటఁ గొనితేర నాయూరఁ
బొరుగిండ్ల వెంబడి పోనివాఁడు,
తనతోడఁగూడి యాడినవారి నేనియు
బదులిమ్మనఁగ భీతివడెడివాఁడు,
తనపైనిఁ గడుజాలిఁగొని సాయపడు దొడ్డ
దొరల ముంగిళ్లలోఁ జొరనివాఁడు,
తన కివ్వనుండి యివ్వని వారి వెనువెంట
నంటి నిర్బంధింప నట్టివాఁడు,

ఆ.వె. అపురుషార్థికాఁడు, అవివేకియుంగాఁడు
మందమతియుఁగాఁడు, పందగాఁడు
అతిమితాత్మగౌరవాభిమానమ్ముల
వీడుకొనఁగ లేఁడు బీదరైతు.

రైతు గొప్పతనాన్ని గుర్తించిన సాహుకారు అతనిని కీర్తిస్తూ రైతును ఋణవిముక్తుణ్ణి చేస్తూ ఈ కాలంలోని పాలనా వ్యవస్థకు, బ్యాంకులకు, ఫైనాన్సు కంపెనీలకు, గ్రామాలల్లో రైతులకు ఋణాలిచ్చే వ్యాపారులకు ఆదర్శవంతంగా నిలిచారు.

క. కలవారల మనుకొని బీ
దలపాలిటి మృత్యు దేవతలుగాక, సదా

మెలcగుట మే లెల్లరకును

సిలుగుదొలcగ నిను విముక్తుc జేసితి రయితా.

"రైతు–ఋణవిముక్తి" పై విశేషాల వలన ఎల్లవేళలా సమాజానికి, పాలకులకు, వ్యాపారులకు, బ్యాంకులకు ఒక ఆదర్శంగా నిలుస్తూ మనము అందరము రైతును గౌరవించాల్సిన అవసరమును తెలియజేస్తుంది.

"రైతు–ఋణవిముక్తి" ని కీ.శే. రాఘవశర్మగారు తన స్వీయ జీవితంలో జరిగిన సంఘటనలను ఉటంకిస్తూ వ్రాసారు.

ఉభయ భాషా ప్రవీణులై, జ్యోతిష్యశాస్త్రంలో నిపుణులై, తెలంగాణలో రజాకార్లు, కమ్యూనిస్టుల ప్రాబల్యం ఉన్న రోజుల్లోనే తన ముద్రణాలయంలో ఎన్నో భక్తి, సామాజిక గ్రంథాలను ముద్రిస్తూ నిరంతర కృషీవలురుగా నిలిచినారు.

ధన్యవాదములతో....

విషయ సేకరణ – సమర్పణ

రాళ్లబండి దివాకర్

ఇం.నెం. 20-291, రోడ్డు నెం. 9,

వెస్టు వెంకటాపురం, అల్వాల్

సికిందరాబాద్ – 500 015

ఫోన్ నెం: 9849698407

శ్రీరామాయ నమః

రైతు ఋణ విముక్తి

సీ. అతఁడు విద్యాధికుండా? కాదు కాకున్న
సర్వధర్మజ్ఞధీశాలి యయ్యె,
నైశ్వర్య సంపన్నుఁడా? కాదు కాకున్నఁ
బాఁడిపంటలుగల్గి ప్రభుత నెఱపె,
వ్యవహార విదుఁడందుమా? కాదు కాకున్నఁ
దీర్పరియను పేరుఁ దెచ్చుకొనియె,
నఖిలావనోద్యోగియా? కాదు కాకున్న
నెల్లరగౌరవం బెనసి మించె,
తే.గీ. మిద్దెమేడలు లేకున్నఁ బెద్ద పెంకు
టిల్లొకటి యోగ్యముగ వినిర్మించుకొనియె,
నెల్లరీతులఁబల్లెలో నెల్ల రత్న
మాతనికి సుతులుండి రైదార్గు రెలమి. 1

ఆ.వె. వారిలోనఁ బెద్దవాఁడు సాధారణ
జననఫలవిపాక జాతకుండు,
పుట్టిపెరుగఁ దల్లిబోఁగొట్టుకొనె నాలు
గేండ్లవాఁ దదృష్టహీనుఁ డగుట. 2

ఉ. ఆతని తాతపాదుఁడుఁ దదగ్రజ పెంచుచు విద్య నేర్పి, ప్ర
ఖ్యాతిగలట్టివారగుట నర్హవిధంబునఁగార్య సంస్కృతుల్

ప్రీతిమెయింబొనర్చి సవరించిరి వారల యానలోన వి
ఖ్యాతిఁగడించి యోగ్యుఁడనఁగాఁ జెలువొందె వినమ్రశీలుఁడై. 3

ఉ. అంతటఁ గొంతకాలమున కాతనితండ్రి దివంగతుండుగా
నెంతయు దుఃఖభారమున నీఁదఁదొడంగెను కాపురంపు టే
ఱెంతకుఁ గాలుసేతులు చలించియు గట్టునఁజేర నేరఁడా
చింతగలట్టి కర్మవివశీకృతజీవనుఁ డస్వతంత్రుఁడై. 4

క. ఆలుంబిడ్డలుఁ దానును
దాలిమిమై నొకట నన్నదమ్ములు, గృహక
ల్లోలములు లేక యెట్లో
కాలముఁగడపిరి స్వతంత్రకాములుగామిన్. 5

తే.గీ. శక్తి గల్గి స్వతంత్రతాసక్తి వొడమ
వేఱువడ నెంచి రవ్వారు వివిధవస్తు
గేహభూవృత్తులంబంచి, సాహసించి
వేఱుగా నుండి రవిరోధవృత్తిఁ జెలఁగి. 6

తే.గీ. తనపొలమ్మునఁ బండిన ధాన్య మొకఁడె
జీవనాధారమై యన్యసేవలేక
యలరి, ఱెక్కాడ బుక్కాడు నన్న రీతి
పేదతనమునఁనొప్పు నాబీదరైతు. 7

సీ. తనయింట లేకుంటఁ గొనితేర నాయూరఁ
బొరుగిండ్ల వెంబడి పోనివాఁడు,
తనతోడఁగూడి యాడినవారి నేనియు
బదలిమ్మనఁగ భీతివడెడువాఁడు,
తనపైనిఁ గడుజాలిఁగొని సాయపడు దొడ్డ
దొరలముంగిళ్లలోఁ జొరనివాఁడు,

తనకివ్వనుండి యివ్వనివారి వెనువెంట
నంటి నిర్బంధింపనట్టివాఁడు,
ఆ.వె. అపురుషార్థికాఁడు, అవివేకియుంగాఁడు
మందమతియుఁగాఁడు, పందగాఁడు
అతిమితాత్మగౌరవాభిమానమ్ముల
వీడుకొనఁగ లేఁడు బీదరైతు. 8

సీ. చేత నాగలివట్టి సేద్యమ్మొనర్చుచు
భూదేవి దయకుఁ గేల్మోడ్చుచుండుఁ,
గలుపుఁదీసెడు వేళ గట్టునఁగూర్చుండి
సరస పద్యమ్ములఁ జదువుచుండుఁ,
బంటకావలినాళ్ళఁ బక్షుల కలరావ
మాలించియు నదల్పఁ జాలకుండుఁ,
గళ్ళపుపూట భిక్షకువచ్చువారలఁ
బ్రేమించి చేటతో భిక్ష వెట్టు,
తే.గీ. నతఁడు భూ దేవతానుగ్రహమున మిగిలి
యున్న ధాన్యమ్ముచేఁ దృప్తి నొందుచుండి,
యనవరత మింటి కేతెంచు నతిథులకునుఁ
దాల్మి మెయి నన్న మిడునట్టి ధన్యుఁడతఁడు. 9

తే.గీ. కారుకారున కారంభ కాలమందు
నెరువువోసి, పొలముదున్ని వరినినాటు,
ప్రత్తిఁబండించి, చేనేతబట్టఁగట్టు
రైతురీతి తత్ప్రీతి కారంభగీతి. 10

చ. కలుపునుదీయఁగానతని కాంతయు బిడ్డయునన్న పానముల్
దలపయిఁదాల్చి రైతుగల తావును జేరి భుజింపఁజేసియుం

బొలమునఁ గాలువెట్టి కలుపుం దొలఁగింతురు భావశీలమం
జుల కలమాధురీరవము జొప్పడఁజక్కని పాటఁబాడుచున్. 11

తే.గీ. అతఁడు తన్మయుండై విను చాదరమున
నాత్మజాగీతముల; నొక్కొకపుడు తగిన
వరుఁడు లభియింపకుండెఁ గూతురున కంచు
యోచనల్ సేయుఁ, జేసియు నూరకుండు. 12

క. పొలమునఁ బనిదీరుచుకొని
యిలుసేరఁగఁ దల్లిబిడ్డ లిరువు రరుగ, నా
వులతోడ నిల్లుసేరును
తలపైనం గడ్డిమోపుఁ దాల్చి దినమ్మున్. 13

మ. ఇలుసేరంజని పాడిగేదెలకుఁ దానే మేతవెట్టించి బిం
దెలఁబాలన్పితికించి, యింటనిడి, తృప్తింబిల్లిలుందానునా
కలిమై వండిన వంటకంబుఁదిని యేకాంతంబునం జేరి, యు
య్యెలమంచంబున నూగుచున్ సుతుల నెంతేఁ(బ్రీతి జోకొట్టుచున్. 14

సీ. "అమ్మ నన్నంబెట్టుమంటె కోప్పడ్డది
అడుగు నాన్నా! ఇప్పు" డనుచు నొకఁడు,
"కావలె మోతారుకారు నా, కెప్పుడు
తెప్పింతు" వని పనిఁ జెప్పు నొకఁడు,
"పిప్పరు మెత్తులో బిస్కెత్తులో నీవు
కొని తేవుపో" యని గులుగు నొకఁడు,
"పగలెల్ల పిల్లల బట్టుకొంటిని పాఠ
మును పద్య మిపుడు చెప్పు" మను నొకఁడు,
తే.గీ. ఆడుపిల్లలు మగపిల్ల లంద ఱిట్లు,
చుట్టుకొని తన్ను వేధింప, సోదెఁ జెప్పి

నిదుర బుచ్చుచుఁ బాఠము నేర్పు నతఁడు
పెద్దకూతున కతిశయ ప్రేమతోడ. 15

తే.గీ. ఆ కుమారిక పదియేండ్ల; దైనఁగాని
చెప్పినట్టి పాఠము వ్రాయుఁ దప్పులేక,
గ్రంథమేదైనఁ దా నిరాఘాటరీతిఁ
జదువు నింపుగ, వినువారి మదిగఱంగ. 16

తే.గీ. అట్టులాబిడ్డతో మాటలాడుకొనుచు,
భార్యపరచిన సెజ్జపైఁ బవ్వళించి,
యుదయ మగుతోడనే పోవుచుండుఁ బొలము
చాయగా శ్రద్ధమై వ్యవసాయమునకు. 17

తే.గీ. చోద్యముగ మెట్టసేద్యాన సొంపుబెంపు
గా ఫలింపఁజేయు, యవ ముద్గ చణకాది
సకలధాన్యచయమ్మతి శ్రమము లేక;
స్వగృహ మా పంటసిరి కాటపట్టనంగ. 18

తే.గీ. కూతురుందాను మంచెపైఁ గూరుచుండి
వడిసెలంద్రిప్పి పులుగుల కడిమిమాన్పు
చుండ నొకట విరాగియొకండు దారి
నరుగుచుం బాడుచుండె గేయమ్మునిట్లు. 19

గేయము

దేవుని భజింప లేవా? జీవా ॥దే॥
భావానందమయ భావానంద గురు ॥దే॥
నావని, నాదని, నావారని, మది,
నీవు తలచెడిది, నిజమా? జీవా! ॥దే॥

నీలో నాలో నిఖిలములో తన
లీలల్ గనపరచి, లీనుండయిన మన ॥దే॥

చ. అదివిని యాపదేండ్లపడు చాదరభావముతోడ, తోడనే
యెదురుగ నేగి మ్రొక్కి నుతియించుచు "స్వామి యొకింత విశ్రమిం
చెదరని కోరుచుంటి, దయ సేయుఁడు నాయనగారియొద్ది" కం
చుదిత విశేషభక్తిమెయి నుల్లము చల్లగ వేడుచుండినన్. 20

తే.గీ. పిల్లమాటలవిని యాతఁ డుల్లసిల్లె,
తోడుకొనిచనె నాపె రైతుగల మంచె
కడకు, నాతఁడు మ్రొక్కి గొంగడిని వైచి
యుచితసత్కార మొనరింప నుత్సహించె. 21

తే.గీ. మధుర సీతాఫలమ్ములు, మంచిజొన్న
కంకు, లరఁటులు, నలసందకాయ లెలమి
బుట్టలంబెట్టి యారగింపుఁడని పలుకఁ
దృప్తిగా సాధు వాకొంటఁ దినియె నంత. 22

తే.గీ. ఆ మహాత్ముఁడు దీవించి, యరుగఁబూన
"స్వామి! మీపాట మరియొకసారి వినఁగ
వేడ్కగల" దని యారైతు వేడుకొనఁగఁ
గూర్మియై నంత నా సాధుకుంజరుండు. 23

క. సాధనచతుష్టయమ్ములు
బోధించుచు నర్థయుక్తముగ వినిపింపన్
మేధావులు వారిర్వురు
బోధగలిగి వెలసిరంతఁ బొంగుచుమదిలోన్. 24

తే.గీ. రయితుబిడ్డనుగాంచి విరాగియనియె
"నమ్మ! నీవు సుశీలవై యధిక భక్తిఁ
దనరి విశ్వేశ్వర ప్రేమ ధన్యవగుదు
గాత" యనియె బ్రహ్మానందకలితుఁడగుచు. 25

క. చనెఁ దనదారిని సాధువు
పనిదీరినపిదప వారు భవనముఁ జేరం
జని; రంతఁ గొంతకాల
మ్మునకున్ రైతునకుఁ గష్టములు సంఘటిలెన్. 26

సీ. జవదప్పిపోయి పంటవలంతి వర్షముల్
లేకపోవుటచే ఫలింపదయ్యె;
కుడువనన్నము కట్టగుడ్డయు బహుయత్న
సాధ్యమై దొరకని సమయమయ్యె,
దినదినమ్మున కష్టంగొని పిల్లలుం దాను
సాపడుకాల మాసన్నమయ్యె,
క్షామకాలమ్మొట సాహుకార్లప్పినఁ
ద్రిప్పిత్రిప్పియు నీని దినములబ్బెఁ,
తే.గీ. గడచినట్టికాలమె సుఖకాలమయ్యె,
దారుణంబగు కాలంబు దాపురించి,
బలముడిగి, చిక్కి, కడగండ్లఁబడి, దరిద్ర
దశ ననుభవించె నారైతు దైవవిధిని. 27

సీ. చెప్పినపనిసేయు జీతగాండ్రును బనిఁ
జాలించుకొని పోవసాగినారు,
ప్రాంతవాసులు తనపంటపొలమ్ముల
మేరదాటుచు నాక్రమించినారు,

హెచ్చిన పన్నులఁ దెచ్చియిమ్మనుచు గ్రా
మాధికారులు బల్మినడిగినారు,
ఆహారధాన్యమ్ము నధికార వర్గము
వారు మాకిమ్మని కోరినారు,

తే.గీ. మన్నెమజుకూరులును, వెట్టిమాదుగులును
నీరడియు బెదరింపఁగా నేర్చినారు,
అప్పులందీర్పుమని కొందరడుగుచుండఁ
జేయునది లేక యా రైతు చిన్నబోయె. 28

ఉ. ఇట్టి విపత్తులుండియును నింటికిఁజేరఁగఁదృప్తిఁ గొల్పుచున్
పట్టుచు గ్రంథముంజదివి భావముఁ జెప్పుచు నింటఁగల్గనే
కట్టుఁజెడంగనీనిపదౌ కందుసమంబులకూర్మిబిడ్డ యు
న్నట్టులనుండి దైవవిధి నంది యిహమ్ము దొఱంగెనంతటన్. 29

తే.గీ. అందినట్టి ఫలమ్ముఁ బోనాడినట్లు,
పుణ్యపుంజము విలయమైపోయినట్లు,
తగుసహాయసంపత్తి వ్యర్థమయినట్లు,
కన్నకూతును నెడబాసి మిన్నకుండె. 30

తే.గీ. అరవిరినమల్లెపువుఁ జీడగొరికినట్లు,
అర్ధనిశి దీపకళిక చల్లారినట్లు,
సిరి గల గృహమ్ము దొంగ దోచికొనినట్లు,
వెతఁదవిలి, కానకుండి, నిర్విణ్ణుఁడయ్యె. 31

ఉ. పోయినకూతుఁగూర్చి వలపోయుచు నాతఁడు నాలుపిల్లలుం
బాయని శోకమోహములఁ బాల్పడి; రాయువు దీ రెనొక్క లేఁ
బ్రాయవు బాలకే, స్వకృత పాతకమే కడగండ్లఁ గూర్చెనొ
క్కోయని చింతసేయు మదిఁ గుందు విరక్తినిఁ జెందు నెంతయున్. 32

సీ. తల్లిమ్రొక్కఁగఁ దిరువళ్ళూరి వీర రా
ఘవుకృపం జనియింపఁగల్గినాఁడు,
తిరుపతి వెంకటేశ్వరుఁ డిలువేల్పుగా
నఖిల శుభోన్నతు లందినాఁడు,
త్రిపురసుందరి దివ్యకృప నన్నుపానాదు
లలర గౌరవమున వెలసినాఁడు,
మమతఁగోదండరామస్వామి యెల్లప్పు
డాపదల్ దొలఁగింప నమరినాఁడు,

తే.గీ. నాగమయ్య, కాశీవిశ్వనాథమూర్తి
మున్ను గాఁగల దైవతమ్ముల భజించి,
కాంచెను శుభమ్ములన్ మున్ను; కర్మవశత
నేఁటికీ రైతు దుఃఖవార్నిధి మునింగె. 33

క. నానాదేశాగతు లొక
ప్రానీయప్రపను జేరి పరమాప్తులుఁగా
బూనికఁ జరియించుచు నా
పై నెవ్వరిదారి వారు పయనమగునటుల్. 34

క. నదిలోన సర్వకాష్ఠ స
ముదయమ్ము ప్రవాహ వేగమున నేకంబై;
కదలుచు నొక్కొక్కటియే
పదపడి కెరటముల వెంటఁబడి యేగునటుల్. 35

తే.గీ. జనన మరణ ప్రవాహ సంసారతటినిఁ
బుట్టి చచ్చుచునుండెడి పురువులట్లు,
దేహికి కుటుంబసక్తి యస్థిర మటంచు
విన్న రైతుకుఁ గొంత వివేక మొదవె. 36

తే.గీ. గర్భ గతుఁడైన యప్పుడు కన్నతల్లి
తిన్న యాహారసారంబుదిగిచి నాభి
నాళమార్గమ్మునను, జీవనమ్మొసంగి
నట్టివాని నమ్మినరైతు కాశయుడిగె. 37

ఉ. ఎప్పుడు బందుగుల్ పలుకరించరు కాంచరు దుఃఖ కాలముల్
చొప్పడ నెట్టి స్నేహితులుఁజూడరుజాడ, రుగాదిబాధలం
దిప్పలుబడ్డ, నప్పునకుఁ ద్రిప్పుచు దెప్పుచు నుందు రందటీ
యప్పులవారిబాధ నడుగంటగ గెంటగ నెంచె నేర్పునన్. 38

తే.గీ. పశువులును, బాఁడిగేదెలు బండ్లు, నగలు
నాణెములు, పూసపోగు, ధాన్యములు నమ్మి
యప్పులన్నియుఁ చెల్లించె, నైన నొక్క
గొప్ప యప్పునకయి మదిఁ గుందఁదొడఁగె. 39

సీ. తినఁదిండి లేకున్నదన విని బండ్లతో
నింటికి ధాన్య మంపించినాఁడు,
ధన మవసరమైనఁ దనవారితోడనే
ఐదులు పదులు నూర్లంపినాఁడు,
సన్నని వస్త్రము లన్ని పండుగులకుఁ
బిన్న పెద్దలకు నర్పించినాఁడు,
అన్నిటఁ దనవార లనుకొని వస్తువా
హన పరికరములం బనిచినాఁడు,
తే.గీ. సర్వశుభకార్యములనుఁ బ్రశస్త రీతి
నెట్టియిక్కట్టులుంగల్గనీక సలిపి,
కలిసియుండు నెల్లపుడు నిష్కపటబుద్ధి,
సకల జనలోక సహకారి, సాహుకారి. 40

క. శ్రీమంతుడు, గుణవంతుఁడు,
ధీమంతుడు, బుద్ధిమద్విధేయుఁడు వినుత
ప్రేమస్వరూపుఁ డెల్లర
నోమఁగలుగు సాహుకారి యుపకారి కదా! 41

తే.గీ. సదయమూర్తికి మనరైతు మొదటినుండి
చెల్లుఁబెట్టంగలే దొక చిల్లిగవ్వ,
అంతఘోరకృతఘ్నుఁడా యతఁడు? కాదు;
దీర్ఘనాసక్తి గలదు, శక్తియె కొఱంత. 42

తే.గీ. కాన నాతఁడు పిల్లలుందానుఁగూడి
యతని సౌధాగ్రభాగమునందు నిలిచి,
కేలుమోడ్చి, "ధనీ!" యని కేకవైవ
నాతఁ దరుదెంచె భార్యతో రైతుకడకు. 43

క. ఏమోయి రయితుబిడ్డా !
క్షేమమ్మా? యనుచుఁ బలుకఁ జిఱుఁజెమటలతో
స్వామీ! క్షేమమ్మే యని
యేమో యనబోయి యంతనే యూరకొనెన్. 44

చ. తెలిసినవాఁడుగాన గురుతించుచునిట్లనె, "నిన్నినాళ్లకుం,
దలపు ఘటించెనా? స్వకృషి తత్త్వముఁ దెల్పుమదెట్టులుండెఁ,గా
వలసినదేమి నీకిపుడు వాస్తవరీతి వచింపు" మన్న జ
ల్జలఁ గనుదోయి బాష్పములు జాఱ సగద్గద దైన్యభాషలన్. 45

చ. బ్రతికితి నిన్ని నాళ్ళు తమ ప్రాపున; నాకృషికర్మ, నాసమ
ర్థత కొఱగానిదయ్యెనుగదా? మితిమీరిన మీ ఋణంబు నే
గతిఁగడ తేర్పఁజాలుదు; బికారిగ నుందునె? చేతఁగాని నా
బ్రతుకున కేమి సేయఁగలవాఁడను మీకృప లేకయుండినన్. 46

క.	అనియూరకున్న నాతని
కనికరమునఁ గాంచి సాహుకారి వచించెన్
పనిమాలి యూరకుండం
జన దెవ్వానికినిఁ గాని సాధ్యమగునెడన్.	47

ఉ.	చేవఁదొఱంగి సేద్యమును జేయఁగలేవయి తేని, నీవు నా
పూవులతోఁటలోఁదులసి, పూవులు, పక్వఫలమ్ములాకులుం
దేవలె నిత్యమున్, గలుపుఁదీయుచు దోహదమాచరించుచుం
గావలివై, ఫలానుభవ కాంక్ష జనింఁపగనీక యుండుమా.	48

క.	తోయములఁ దోడిపోసి, యు
పాయముగాఁ దోఁట వృద్ధి పఱపుము; నీవున్
నీయిల్లాలును బిల్లలుఁ
జేయఁగలుగుపనులఁ జేసి జీవింపఁదగున్.	49

క.	నాకొడుకు దుష్టుఁ డాతని
రాకకు భీతులుము, బీదరయితా! నీపై
మాకు దయవొడమె, మిమ్మున్
సాకుదు మిఁక జింతసేయఁ జనదు మనమునన్.	50

తే.గీ.	చొరఁబడెడు దొంగలున్నారు చుట్టుముట్టు
తెలివిగల్గి నాతోఁట కావలివి గమ్ము
కార్యములపట్ల జాగరూకత వహింపు
మన్ని వేళల నిన్ను నే నరయుచుందు.	51

తే.గీ.	అనిన విని నిస్తరంగ సుధాబ్ధి పోల్కి
మౌనమూని భావానంద మగ్నుఁడయ్యెఁ
గలఁతలేని యేకాంతముగాఁ దలంచి
కాలముం బూలతోఁటలోఁ గడుపుచుండె.	52

ఓం

రైతు ఋణ విముక్తి

౨

సీ. తొలుదొల్తఁ దరుజాలముల పత్రములు రాలి
చివురుజొంపమ్ములు జేవురింపఁ,
గొల్లగాఁబూచిన మల్లెపూఁదావులు
పిల్లగాడుపులతో వెల్లివిరియ,
నిరు గెలంకుల నున్న యరఁటిమ్రాఁకులు పాంథ
జనమున కాకువీవనలు వీవ,
మావిచివుళ్ళ కమ్మఁదనమ్మునం జొక్కు
గండుకోయిలలు స్వాగతముఁ బాడ,

తే.గీ. విమల కమలాకరములు పాద్యము లొసంగ,
కీరశారికాగణములు క్షేమ మడుగ
నమరు నా రైతుగలతోఁట యవ్వసంత
కల్పిత ప్రప యన హాయిఁగొల్పుచుండె. 1

తే.గీ. అట్టితోఁటకు మారైతు నాప్తుఁ డొక్కఁ
డొంటరిగ విశ్రమింపఁగా నుస్సురనుచు,
నరుగుదెంచె నధ్వశ్రమ నందికంది
తీర్థయాత్రకు బలరామదేవునట్లు. 2

క. వచ్చినయాతనిఁగని, తన
నెచ్చెలి కానోవు ననుచు నిలిచె, నెదురుగా
వచ్చెడి యప్పాంథుఁడు మది
నచ్చెరువంది గమనించి యాతనిఁ గాంచెన్. 3

తే.గీ. కట్టినాఁ డొకగుడ్డ మోకాలిపయికి
చిక్కిపోయి యున్నాఁడు కుచేలునట్టు
లెవరొకో యీతఁ? డీతని నెపుడొ చూచి
యున్నటులఁ దోఁచునని తలయూచుచుండె. 4

క. రయితు యెదు రేగి మ్రొక్కి వి
నయముగ "దయసేయుఁ" డనుచు నవ్విన దనకుం
బ్రియమిత్రుఁ డని యెఱింగి హృ
దయమున నారైతు మార్పుదలఁ దలపోసెన్. 5

క. అంతట నిరువురును సరః
ప్రాంతంబును జేర భానుఁ డ స్తంగతుఁడై,
కొంతవడికిఁ, జంద్రోదయ
కాంతులు నలుగడలఁ బాఱఁ గౌతుకరీతిన్. 6

క. జలకములాడి తటమ్మునఁ
గల ధౌతాంబరముఁ గట్టి కలిపిన భూతిం
దిలకము ధరించి సాంధ్యవి
ధులు దీర్చి భుజించి తృప్తితోఁ బొదరింటన్. 7

ఆ.వె. పఱచియున్న శయ్యపైని నాయాప్తుఁడు,
రైతు మిత్రభావరీతి దోఁప,
నుచితగతిని నొకట సుపవిష్టులైనంత
రైతు సుహృదు నిటులఁ బ్రశ్న నేసె. 8

మ. అనఘా! ఎచ్చటనుండి యెచ్చటికి మీ యభ్యాగమం? బింటిలో
మనవారెల్లరు సేమమేకద? స్వసంపన్మూలమౌ సేద్యమం
దున లాభ మ్మొనగూడుచుండుఁగద? నాతోఁగూడి మీరున్న యా
దినముల్, నేను, నొకప్పుడేనిఁ దమజ్ఞప్తిన్ వత్తుమా? నావుడున్. 9

సీ. మఱతునా? మనమొకమారు విద్యార్థుల
మై యుండి గడపిన యవసరములు,
మఱతునా? మనమొక మారు సద్గురుఁజేరు
దారిలో నిసుక యెడారిపాట,
మఱతునా? మనమొకమా ఱారగించిన
బుడమకాయల పప్పు పుల్లగూర,
మఱతునా? మనమొకమాఱు మోముందోము
కొనువేళఁ దీసిన కూనరాగ.

తే.గీ. మెన్నియనియందు; నిను నెంచకున్న దినము
జ్ఞప్తికేరాదు; మాయింట సతిసుతాదు
లెప్పుడున్నిన్ను రాఁగోరి చెప్పుచుందు
రింతదాఁక క్షేమంబె మాకెల్లరకును. 10

తే.గీ. అరిగియుంటిని యాత్ర నొంటరిగ నేను
వచ్చుచున్నాను తిరిగి భవనముఁజేర,
నా విశేషము లట్లుండె, నకట! నీవు
తొంటిరీతిని లేకుంటఁ దోచకుండె. 11

క. మనభూవృత్తిస్వాస్థ్యము
మనపూర్వుల గౌరవాభిమానస్థితులున్
విని, కని యుంటిని నీవీ
దినమున కిట్లొట నా కిదేయద్భుతమౌ. 12

సీ. అరయంగ "కృషితోనాస్తి దుర్భిక్ష" మన్
పెద్దలు వాకొన్న విహితవృత్తి,
"హాలికులైన నే" మని పోతనామాత్యుఁ
డెన్నుకొన్నట్టి యహీనవృత్తి,
సర్వవర్ణప్రజా సామాన్యధర్మమై
చేయక తప్పని శ్రేష్ఠవృత్తి,
యోగ్యతర ప్రభుత్వోద్యోగమునకన్న
నుత్తమంబేయను నుచితవృత్తి,

తే.గీ. బ్రాహ్మణ క్షత్ర వైశ్య శూద్ర ప్రభృతుల
కందఱకు ననుసరణీయ మైనవృత్తి,
తాఱుమాఱులేనట్టి స్వతంత్రవృత్తి
సేద్యమనుపేరి వృత్తినిఁ జెప్పఁదరమె. 13

సీ. బ్రాహ్మణు లగ్రహారము లెన్ని యుండిన
నిన్నాశ్రయింపక నిలువలేరు,
క్షాత్రవంతుల కెన్ని జాగీరులున్నను
నినుఁ గదల్చిన నూర నెగడలేరు,
వైశ్యుల కెన్ని వ్యాపారముల్ గలిగిన
నీపంటఁ గొనక కాల్నిలుపలేరు,
శూద్రు లెంతెంతటి శూరులయ్యును నీదు
కూలి కాసింపక కుడవలేరు,

తే.గీ. సర్వజనులు నీయాధారసరణి వివిధ
భోగభాగ్యాదులం దులదూగుచుండ,
రయిత! నీజాతి కిట్టి ప్రారబ్ధమేమొ?
నీవు నీయంతవాఁడవై పోవవలసె. 14

క.	పలువురు హలముంగొని నీ
వలెనే వ్యవసాయ మొనరుపంగోరి మహో
జ్జ్వల జాత్యున్నతి నొందం
దలచిరి. నీ హలము భాగ్యదశఁ గూర్పదొకో. 15

తే.గీ.	బ్రాహ్మణుల్ సైతము హలమ్ముపట్టి దున్ని
భూమి సేద్య మొనర్పకపోయి రేని
పెద్ద లార్జించికొన్న భూవృత్తు లుడిగి,
పరులకడఁ జేరి జీవింపవలసివచ్చు. 16

సీ.	వేదశాస్త్ర పురాణ విదులయి యాచింప
మూర్ఖులచెంతకుఁ బోవుకంటెఁ,
బాదముల్ గడిగి పాపపు దానముల నివ్వఁ
జేఁజాచిమిడికి యార్జించుకంటె,
మొదట దండముఁబెట్టి పిదప హేళనసేయు
చెడుగుల కడ డబ్బు నడుగుకంటె,
జాతీయధర్మవిశ్వాసమ్ముఁ బోనాడి
యితర వృత్తులఁ బ్రవర్తించుకంటె,
ఆ.వె.	నీరుకాసుఁబట్టి నీచాతి నీచమౌ
యాచనమున నొరుల దోచుకంటె,
స్తబ్ధబుద్ధివీడి తగురీతిఁ గృషిఁజేసి
బ్రతుకుచుంట విప్రతతికి మేలు. 17

తే.గీ.	విప్రులే కాదు; ప్రతివారు వివిధకళలఁ,
గార్మిక పరిశ్రమల, నవ్య కావ్య రచన,
గాన వాద్య సాధనముల వేన నేని
కృషి నొనర్పనివార లాకృతికి రారు. 18

తే.గీ. బాహ్యకృషి సేయుచుండి, నీపగిది నంత
రంగ కృషి సేయు భక్తుఁ దసంగ విమల
చిత్తమున నిరాడంబర జీవితమ్ముఁ
గుడుపుచుండు భావానందకలితుఁడగుచు. 19

చ. అదియటునుండనిమ్ము సఖుడా? యిట నేలవసించుచుంటి, వా
పదయదియెట్టిదోయి! తెలుపందగునంచన, బూసఁగ్రుచ్చిన
ట్లొదవిన చిక్కులన్ గడపుచుండిన జీవితము స్వచించి, యిం
పొదవగఁదన్ను నేలుసదయున్ బొగడెందనసాహుకారినిన్. 20

సీ. అన్ని దేశములయం దతని వ్యాపారమే,
యన్నింట నతఁడే నియామకుండు,
ఆతని వేతన మభిలషింతురు సర్వు
లప్పుఁ గోరినవారి కతఁడొసంగు,
సులభముగాఁ దీర్పఁగల దారిఁ జూపించుఁ
దీర్పనివారలఁ దేరిచూడఁ,
డెత్తుజిత్తులు లేక యేకరీతిగ నుండు,
నెఱిఁగినవారిచే నెఱుఁగబడెడు,
తే.గీ. నతని యిల్లాలిచే భాగ్యమందు రంద
ఱగ్రతనయుఁడు వ్రాఁతలో నతిచతురుఁడు,
చిన్నకొడుకు పోకిరి యని చెప్పుచుందు,
రతని బిరుదములు పరమాద్భుతము లరయ. 21

సీ. దేవతాస్థలములఁ దీర్థయాత్రికులకై
షడ్రసోపేతాన్న సత్రములను,
విద్యార్థులకు సర్వవిధ శాస్త్రసాహిత్య
మర్మబోధక కళామందిరములు,

రోగార్తులకు సదారోగ్యకృదౌషధ
ప్రకరంబు లిచ్చెడు వైద్యశాల,
లగతికులైన పంగ్వంధక భైక్షుకో
న్మాదులకయి శరణాలయములు,
తే.గీ. ఆమ్రవనములు, రమ్య జలాశయములు
దేవతాలయ గోపురాదికము లైన
ధర్మకార్యము లాతఁ డుదారబుద్ధి
నఖిల భారతదేశమ్మునం దొనర్చె. 22

చ. కృతులు రచించి సత్కవులు కీర్తి మదగ్రణియైన యాతనిం
గృతిపతిఁగా నొనర్పఁ బరికించి బహూకృతిసేయు, గాయక
ప్రతతియు జంత్రగాత్రములఁ బాడిన నాడిన సత్కరింపఁగా
నతఁడు దలంచెనేనిఁ దనయంతటివారి నొనర్చునందఱన్. 23

తే.గీ. అతఁ డసామాన్యుఁ డనుపముఁ డద్వితీయుఁ
డగతికశరణ్యుఁ డభయదుఁ డార్త పాలుఁ
డనుచు రై తుగ్గడింపఁగా; వినిన యాప్తుఁ
డనియె నిట్లు లోకానుభవాత్మసరణి. 24

ఆ.వె. సాహుకారి యనిన స్వాత్మలాభమ్మునే
చూచుచుండుఁ బరుల దోచుచుండుఁ,
దెలివితో నమాయికులఁ జేరఁదీసి, యా
డించు బొమ్మలట్టు లిచ్చిపుచ్చి. 25

క. అనవిని తన మనమున నే
యనుమానము లేని రీతి నను రైతు; సఖా!
నను నేల పరీక్షించెదు?
వినిచెద వినుమా మదాత్మవిశ్వాసంబున్. 26

ఆ.వె. “న న్ననన్యచింతనమ్మున నాశ్రయిం
చియు దృఢాత్మనిష్ఠఁ జెలఁగునట్టి
జనుల జీవితప్రసాదయోగక్షేమ
భారమును వహించువాఁడ నగుదు”. 27

క. అనుచు నభయ మొసంగుట నీ
తనిఁజేరి, తదాజ్ఞముందెఁ దనవారనియే,
కనికరమునఁ బోషింపుచు
మనుపుచు నున్నాఁడు గాదె మమ్మెల్లరనున్. 28

తే.గీ. అని తెలుపఁగా నిరుత్తరుఁడైనయట్లు
నిదుర గదురుకొనన్ శయనించెనాప్డుఁ,
డంత నిదురించె రైతు, నిశాంతమగుట
బాలభాస్కరుఁ డవ్వారి మేలుకొలిపె. 29

తే.గీ. త్వరితముగఁ గాల్యకృత్యముల్ జరిపి యంతఁ
బయనమయ్యె నయ్యాప్తుఁడు భవనమునకు
రైతు వెనువెంట నడువ; ద్వారమ్ముచెంత
వారలను గాంచి, మన సాహుకారి యనియె. 30

క. చెలికానికి నీతోఁటం
గల ఫలమొకటైన నీయఁగాలేదా? యీ
ఫలము లిడుమనిన, నాతని
సెలవుంగొని యొసగెఁ నా రుచిగల ఫలమ్ముల్. 31

తే.గీ. ఆ ఫలములంది ముదమంది యాప్తుఁ డరుగ
నతని వెనువెంటఁ గొంత దవ్వరిగి, పనిపి
వచ్చి నిలిచిన నారైతు వాలకంబుఁ
గనుచు యజమాని, యే మని యనియెఁ గరుణ. 32

తే.గీ. రైతు మదిలోన నొకచింత రవులుకొనుట
డీలువడి యెట్టకేలకు, జాలిగలుగ
నిట్టులనెఁ బ్రభూ! నే నిశ్చయించుకొంటి
సకలమునకు మనోబుద్ధు లొకటిఁజేసి. 33

క. దేవా! నాదగుసంపద
భావింపఁగఁ గుంటిగ్రుడ్డి పశువులు రెండే;
నావలని కనికరపుఁ గనుఁ
గ్రేవల నీరెంటి నప్పు క్రిందికిఁ గొనుమా! 34

క. నిలువక నలుదెసలకుఁ బరు
వులువెట్టెడి దొకటి, తిరుగఁబోక తెగఁదినం
గలదొకటి, వీని నైజముఁ
దెలిపితి, నను ఋణమునుండి తేల్పుము దేవా! 35

ఉ. నూటికి నూలుపోగుగఁగొనుండివి రెండును; మీ రుణమ్ము నా
నాఁటికిఁ దీర్చుకోదగిన నమ్మికలేమి నిటుల్ వచించితిన్,
గూటికి గుడ్డకుం దమరు గూర్చుచునుండిన నాయెడందనా
రాటము మాను నింకఁ, దమరైతు కృతార్థుఁడగున్ మహాప్రభూ. 36


చ. అనవిని మందహాసమున నాతనితో నను, నిట్టి నేరుపుం
దన మెటులబ్బె, నీకెవరు దారసిలన్విని నేర్చుకొంటి, నీ
కనుగుణమైన సత్యసుఖ మారసినాఁడవు, కాన నాకునే
కినుకయు లేదు, నిన్నుఁ బరికింపఁగ రిక్తుడవౌటఁగర్షకా! 37

ఆ.వె. ఆశనంటఁగట్టి యల్లాడ నుఱ్ఱూత
లూపుచుంట యెవరికొప్పుగాదు,
భేదముడిగి మిగుల పేదయై కడ తేరఁ
దలఁచి యిట్టులనుట తప్పుగాదు. 38

క. కలవారల మనుకొని బీ
దల పాలిటి మృత్యు దేవతలుగాక, సదా
మెలఁగుట మే లెల్లరకును
సిలుగు దొలఁగ నిను విముక్తుఁ జేసితి రయితా. 39

చ. ఇదియొక దారిఁగాఁ దలఁచి యెల్లరు నప్పెగ వేయరాదు, నీ
హృదయగతానుతాపము శమింపఁగ నిట్టులొనర్చినాఁడ, నా
సదనము భోగభాగ్యములు సర్వము నీయటువంటివారి కే
యదనుననో లభించు; నిఁక నాత్మసుఖించుచు మేలుఁ గాంచుమా! 40

తే.గీ. అనిన విని నిస్తరంగ సుధాబ్ధిపోల్కి
మౌనమూని భావానందమగ్నుఁ డయ్యె,
కలతలేని యేకాంతముఁగా దలంచి
కాలమాపూలతోఁటలోఁ గడవఁగడఁగె. 41



raitu runa vimukti
rallabandi raghava sarma

'రైతు ఋణ విముక్తి' ఒకరకంగా ఆత్మకథే. తెలంగాణలో బ్రాహ్మణులు, వైశ్యులు కూడా వ్యవసాయం సాగించిన దాఖలాలు చాలా కనిపించాయి.

-నందిని సిధారెడ్డి

'రైతు ఋణ విముక్తి' అను ఈ చిన్ని పొత్తమునఁ గల యితివృత్తమున సైతము రైతు యొక్క సాంసారిక నిత్యజీవితమును, కర్మఫలానుభూతములగు సుఖదుఃఖ సముపలబ్ధములును తద్విమోచన యత్నములును, చిత్రితములైయున్నయవి.

-వెల్లంకి వేంకటరమణయ్య

బ్ర॥శ్రీ రాఘవశర్మగారి ఖండకావ్య మామూలాగ్రముగా చూచినాను. కవిత లలితమైన భాషతో సలక్షణ శైలిలో నడిచినది.

-శిరోమణి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

'రైతు ఋణ విముక్తి' పద్యకావ్యం 1951వ సంవత్సరంలో ప్రచురితమైనప్పటికీ ఈ కావ్యంలోని అంశాలు కాలంతో నిమిత్తం లేకుండా సర్వకాల సర్వావస్థలయందు స్మరించుకోవాల్సిన అంశాలు.

-రాళ్లబండి దివాకర్

Check List

Book Number	PS01J366	Date	14/11/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	CI, 2, 6, 39		
Missing Pages	NO		
Prepared By	Ch. Ramya	Cutting By	Ch. Ramya
Scanned By	[illegible]	Pages	43